# నమస్తే ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 3 | సంచిక: 284 | పేజీలు: 4 | వెల: రూ.4/- | బుధవారం 10 జూన్ 2026 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## స్వయం సహాయక బృందాలకు
# 553 ఆర్టీసీ బస్సులు

### జెండా ఊపి ఆర్టీసీ బస్సులను ప్రారంభించిన సీఎం

### సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో మహిళాశక్తి సభ

**హైదరాబాద్, జూన్ 9 (నమస్తే ఉదయం)**

మన సంస్కృతి, సంప్రదాయంలో మహిళలకు ప్రత్యేక గుర్తింపు ఉందన్న సీఎం రేవంత్ రెడ్డి మహిళాశక్తిని ప్రపంచానికి చాటిన ఘనత ఇందిరాగాంధీకి దక్కుతుందని తెలిపారు. స్వయం సహాయక బృందాలకు 553 ఆర్టీసీ బస్సులు పంపిణీ చేశారు. జెండా ఊపి ఆర్టీసీ బస్సులను ప్రారంభించారు. అనంతరం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన సభలో పాల్గొని రేవంత్ రెడ్డి మాట్లాడారు. ఇందిరమ్మ రాజ్యంలోనే మహిళలకు గుర్తింపు ఉంటుందని అన్నారు. మహిళలతో పెట్టుకున్న ఎవరైనా అధికారంలో ఉంటారా? అని ప్రశ్నించారు. మహిళలతో పెట్టుకున్నందుకే బీఆర్ఎస్ ప్రభుత్వం ఓడిపోయిందని పేర్కొన్నారు.

స్వాతంత్ర్యం రాగానే మహిళలకు ఓటు హక్కు : అందరికంటే ముందుంటామని మహిళలు నిరూపిస్తున్నారని, వ్యవసాయానికి ప్రాణవాయువు ఆడబిడ్డలని, ఆడబిడ్డ పుడితే మహాలక్ష్మి వచ్చిందని సంతోషపడే సంస్కృతి మనదని కొనియాడారు. మహిళలను స్ఫూర్తిగా తీసుకొని పరిపాలన చేస్తున్నామని అన్నారు. అమెరికాలో మహిళలకు ఓటు హక్కు వచ్చేందుకు వందల ఏళ్లు పట్టిందని, భారత్‌కు స్వాతంత్ర్యం రాగానే మహిళలకు ఓటు హక్కు ఇచ్చిన ఘనత నెహ్రూకి దక్కుతుందని తెలిపారు. దేశానికి తొలి మహిళా రాష్ట్రపతిని అందించిన ఘనత కాంగ్రెస్‌దేనని గుర్తు చేశారు.

మహిళలకు రిజర్వేషన్ల బిల్లు : బీజేపీ పార్టీ అధ్యక్ష పదవిని ఒక్కసారైనా మహిళలకు ఇచ్చారా? అని




ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తొలి ఐదేళ్లలో ఒక్క మహిళకూ మంత్రి పదవి ఇవ్వలేదని విమర్శించారు. తమ ప్రభుత్వంలో ఇద్దరు మహిళలకు మంత్రి పదవులు ఇచ్చామని చెప్పుకొచ్చారు. స్థానిక ఎన్నికల్లో మహిళలకు రాజీవ్‌గాంధీ రిజర్వేషన్లు ఇచ్చారని, చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లకు 2013లో సోనియాగాంధీ బిల్లు ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. "2034 వరకు మీ ఆశీర్వాదంతో ఈ ప్రభుత్వాన్ని నడిపిస్తాం. వెయ్యి కాదు 3 వేల ఆర్టీసీ బస్సులు తీసుకొస్తాం. ఇందిరమ్మ ఇల్లు ఆడబిడ్డల పేరు మీదే ఇచ్చాం. పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇల్లు నిర్మించి మహిళల పేరుమీదే ఇస్తాం. మీకు ఎవరు అడ్డం వచ్చినా ఆర్టీసీ బస్సుతో తొక్కించండి. మహిళలను అభివృద్ధిలో సగం వ్యాపారంలో సగం చేశాం. రిలయన్స్‌తో పోటీ పడి పెట్రోల్ బంక్‌లను మా ఆడబిడ్డలు

..మిగతా 2లో



# దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలి

### రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి సవాల్

### అభద్రతా భావంతో రేవంత్ వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారన్న కిషన్ రెడ్డి

### రాష్ట్ర అభివృద్ధి, పెండింగ్ ప్రాజెక్టులపై చర్చకు రావాలని సవాల్

### ఒక్క ప్రాజెక్టును అడ్డుకున్నట్టు నిరూపించినా రాజీనామా చేస్తానన్న కిషన్ రెడ్డి

**హైదరాబాద్, జూన్ 9 (నమస్తే ఉదయం)**

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీల వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనపై, కేంద్ర ప్రభుత్వంపై బురదజల్లుతున్నారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన... అహంకారం, అభద్రతా భావం, తీవ్ర నిరాశతోనే రేవంత్ రెడ్డి వ్యక్తిగత విమర్శలకు, తప్పుడు ప్రచారాలకు దిగుతున్నారని ధ్వజమెత్తారు.

"కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉందంటే అది రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీల దయాదాక్షిణ్యాల వల్లేమీ కాదు. నేను అంబర్‌పేట్, సికింద్రాబాద్ ప్రజల ఆశీస్సులతో ఢిల్లీకి వెళ్లాను. రేవంత్ రెడ్డికి సమాధానం చెప్పాల్సిన అవసరం నాకు లేదు. తెలంగాణ ప్రజలకు, నా నియోజకవర్గానికి, నా పార్టీకి మాత్రమే నేను జవాబుదారీని" అని స్పష్టం చేశారు.

తెలంగాణ ..మిగతా 2లో



## రికార్డు స్థాయిలో
# ధాన్యం సేకరించాం

### మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

### ధాన్యం సేకరణలో దేశంలోనే తెలంగాణ రికార్డు సృష్టించిందన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి

### రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేశామని ప్రకటన

### పక్క రాష్ట్రాలు తమ కన్నా తక్కువ కొన్నాయని వెల్లడి

**హైదరాబాద్, జూన్ 9 (నమస్తే ఉదయం)**

ధాన్యం సేకరణలో దేశంలోనే తెలంగాణ రికార్డు సృష్టించామన్న పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రూ.35,077 వేల కోట్లు రైతుల ఖాతాలో వేశామన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా 8,575 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. 65.91 లక్షల ఎకరాల్లో 141 లక్షల మెట్రిక్ టన్నుల వరి పండిందని, 52 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని కేంద్రం చెప్పిందని అన్నారు. 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు.

53 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు : దేశంలో పండే వరిలో 61 శాతం తెలంగాణలోనే ..మిగతా 2లో

## పాత బస్తీలో మెట్రోకు
# తొలగిన అడ్డంకులు

2

# హైదరాబాద్‌లో భారీ వర్షం

### కరెంట్ తీగలు తెగిపడి ఇద్దరు యువకులు మృతి

### పలు చోట్ల ఈదురుగాలుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం

### రోడ్లపైకి వరద నీరు - రంగంలోకి హైడ్రా బృందాలు

**హైదరాబాద్, జూన్ 9 (నమస్తే ఉదయం)**

హైదరాబాద్ నగరంలోని చాలా చోట్ల ఈదురుగాలులతో వానపడింది. దీంతో అనేక ప్రాంతాల్లో చెట్లు నేలకొరిగాయి. ఫలితంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. భారీ వర్షానికి ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. సమస్యను పరిష్కరించేందుకు ..మిగతా 2లో



# మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ

### మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ

### తెలంగాణ కోర్టు కేసు వివరాలు దాచిపెట్టారని బీజేపీ అభ్యంతరం

### ఇది కేసు కాదని, కేవలం నోటీసు మాత్రమేనని వాదించిన కాంగ్రెస్

### గాంధేయవాద మహిళను చూసి బీజేపీ భయపడుతోందని కాంగ్రెస్ నేత విమర్శ



**హైదరాబాద్, జూన్ 9 (నమస్తే ఉదయం)**

మధ్యప్రదేశ్ రాజ్యసభ ద్వివార్షిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ తరఫున ఏకైక అభ్యర్థిగా బరిలో ఉన్న మీనాక్షి నటరాజన్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి మంగళవారం తిరస్కరించారు. తెలంగాణ కోర్టులో పెండింగ్‌లో ఉన్న ఒక కేసుకు సంబంధించిన సమాచారాన్ని ఆమె ఉద్దేశపూర్వకంగా దాచిపెట్టారంటూ బీజేపీ లేవనెత్తిన అభ్యంతరంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే, హైదరాబాద్ కోర్టులో మీనాక్షి నటరాజన్‌పై ఒక పిటిషన్ దాఖలైంది. లైంగిక వేధింపులు, ప్రాణహాని బెదిరింపుల ఆరోపణలు ..మిగతా 2లో

# హైదరాబాద్‌లో భారీ వర్షం

హైడ్రా బృందాలు రంగంలోకి దిగాయి. భారీ వర్షం, ఈదురుగాలులకు పాతబస్తీ బండ్లగూడలో కరెంట్ తీగలు తెగిపడ్డాయి. ఈ ఘటనలో జాఫర్(25), అబూ(16) అనే ఇద్దరు యువకులు మృతి చెందారు. ఛత్తా బజార్‌లో రోడ్డుపై కమాన్ కూలింది. ఆ సమయంలో రోడ్డుపై ఎవరూ లేకపోవడంతో ప్రాణ, ఆస్తినష్టం తప్పింది. నగరంలోని కేపీహెచ్‌బీ, బాచుపల్లి, ప్రగతినగర్, మియాపూర్, చందానగర్, ముషీరాబాద్, చంపాపేట్, కర్మన్‌ఘాట్, సరూర్‌నగర్, సైదాబాద్, కోఠి, సుల్తాన్‌బజార్, అబిడ్స్, బషీర్‌బాగ్‌లో, నారాయణగూడ, హైదర్‌గూడ, లక్డీకపూల్, ట్యాంక్‌బండ్ ప్రాంతాల్లో వర్షం కురిసింది. మాదాపూర్, కొండాపూర్, రాయదుర్గం, రాజేంద్రనగర్, హైదర్‌గూడ, లంగర్‌హౌస్, కార్వాన్, మెహదీపట్నం, ముషీరాబాద్, ఆర్టీసీ క్రాస్‌రోడ్, చిక్కడపల్లిలో వాన పడింది. బాగ్‌లింగంపల్లి, గాంధీనగర్, బోలక్‌పూర్, కవాడిగూడ, రామ్‌నగర్ ప్రాంతాల్లో వర్షం కురిసింది.

ఈదురుగాలులకు నేలకొరిగిన చెట్లు : సికింద్రాబాద్, బోయిన్‌పల్లి, తిరుమలగిరి, అల్వాల్, గచ్చిబౌలి, లింగంపల్లి, హైటెక్‌సిటీలో భారీ వర్షం కురిసింది. బొల్లారం, ప్యాట్నీ, ప్యారడైజ్, మారేడుపల్లి, చిలకలగూడ, జేబీఎస్, బేగంపేట్ ప్రాంతాలలో భారీ వర్షం పడింది. ఈ భారీ వర్షాల కారణంగా హైదర్‌గూడలో ఓ భారీ వృక్షం నెలకొరిగి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. రామ్‌నగర్ వీఎస్టీ రోడ్డులో మరో చెట్టు నేలకొరిగింది. ముషీరాబాద్‌లో ఈదురుగాలులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

ట్రాఫిక్‌కు అంతరాయం : భారీ వర్షం కారణంగా అనేక ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ అయింది. లోతట్టు ప్రాంతాల్లోని రోడ్లన్నీ జలమయం అయ్యాయి. భారీ వర్షం నేపథ్యంలో మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం, మియాపూర్ ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం రహదారులపై వరద నీరు నిలిచిపోయింది. వరద నీరు రోడ్లపై నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు.

రోడ్లపై వరద ప్రవాహం : మాదాపూర్ పర్వత్‌నగర్ చౌరస్తా వద్ద వరద వర్షపు నీరు నిలిచిపోవడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఇదే తరహాలో గచ్చిబౌలి, మాదాపూర్‌లో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. నాంపల్లి పరిసర ప్రాంతాల్లో రోడ్లపై వరద నీరు ప్రవహించింది. దీంతో ఆప్రాంతంలో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. మియాపూర్ జేపీనగర్‌లో రోడ్డుపై భారీగా వరద నీరు నిలిచిపోవడంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. హిమాయత్‌నగర్‌లోని ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో వృక్షం నేలకొరిగింది. బాగ్‌లింగంపల్లి సాయిబాబా ఆలయం వద్ద చెట్టు విరిగిపోవడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. రాజేంద్రనగర్‌లోని పాత కర్నూలు రహదారిపై వరద నీరు నిలిచింది.

అత్యధికంగా 8.7 సెం.మీ. వర్షపాతం : హైదరాబాద్‌లోని బన్సీలాల్‌పేటలో అత్యధికంగా 8.7 సెం.మీ, విఠల్‌వాడిలో 7.8 సెం.మీ, హిమాయత్‌నగర్‌లో 7.8 సెంటీమీటర్లు, విద్యానగర్‌లో 7.3 సెంటీమీటర్లు వర్షపాతం నమోదయింది. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద 7.8 సెం.మీ, బహుదూర్‌పురలో 5.7 సెం.మీ, మారేడపల్లి 5.7 సెం.మీ, నాంపల్లిలో 5.5 సెం.మీ, ఆసిఫ్‌నగర్‌లో 5.5 సెం.మీ వర్షపాతం రికార్డు అయింది. శేరిలింగంపల్లిలో 5.3, కూకట్‌పల్లిలో 5.2 సెం.మీ, అంబర్‌పేటలో 4.7 సెం.మీ. వర్షపాతం నమోదయింది.

హైడ్రా కమిషనర్ రంగనాథ్ పర్యటన : హైదరాబాద్ వరద ప్రభావిత ప్రాంతాల్లో హైడ్రా కమిషనర్ రంగనాథ్ పర్యటించారు. ట్యాంక్‌బండ్‌పై వరద నీటి మళ్లింపు, కూలిన చెట్ల తొలగింపును పర్యవేక్షించారు. భారీ గాలులకు హైదరాబాద్‌లో 76 ప్రాంతాల్లో చెట్లు నేలకూలాయి. కొండాపూర్, గచ్చిబౌలి, షేక్‌పేట, మాదాపూర్‌లో చెట్లు నేలకొరిగాయి. హైడ్రా డీఆర్ఎఫ్ బృందాలు రహదారులపై నిలిచిన నీటిని నాలాల్లోకి మళ్లిస్తున్నాయి. వీటికోసం ప్రత్యేకంగా భారీ మోటార్లను వినియోగిస్తున్నాయి. ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు హైడ్రా సిబ్బంది కృషి చేస్తోంది.

# రికార్డు స్థాయిలో ధాన్యం సేకరించాం

మొదటి పేజీ తరువాయి...

ఉందని మంత్రి ఉత్తమ్ తెలిపారు. పక్కరాష్ట్రం 25 లక్షల మెట్రిక్ టన్నుల వరి మాత్రమే కొనుగోలు చేసిందని, యాసంగి పంటలో పక్క రాష్ట్రాలు తమ కన్నా తక్కువ కొన్నాయన్నారు. ధాన్యం కొనుగోలు ద్వారా మహిళా సంఘాలు, పీఏసీలను బలపరుస్తున్నామన్నారు. మహిళా సంఘాల ద్వారా 53 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేయించామని, రూ.171 కోట్లు మహిళా సంఘాలకు ఇచ్చామని వెల్లడించారు. పీఏసీల ద్వారా 90 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామని వివరించారు.

ఉన్న ప్రతి వరి గింజను కొనుగోలు చేశాం : 20.86 కోట్ల గోనె సంచుల్లో 18 కోట్లు మాత్రమే ఉపయోగించామన్న మంత్రి, తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఈ యాసంగి పంటలోనే ఎక్కువగా ధాన్యం సేకరించామని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తమ కన్నా తక్కువ ధాన్యం సేకరించిందని, బీజేపీ పాలిత రాష్ట్రంలో కూడా ఇంత వరి సేకరణ చేయలేదన్నారు. పది సంవత్సరాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు రూ.1.35 లక్షల కోట్లు ఇచ్చిందని, కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లలో రైతులకు రూ.లక్ష కోట్లు ఇచ్చిందని తెలిపారు. వరి సేకరణలో కేంద్రం ఇచ్చిన టార్గెట్ కంటే బీఆర్ఎస్ ప్రభుత్వం తక్కువ కొనుగోలు చేసిందని పేర్కొన్నారు.కేంద్రం కోటా తగ్గించినా కొనుగోలు చేస్తున్నాం : కేంద్రం ఇచ్చిన టార్గెట్ కంటే ఎక్కువగానే వరి సేకరించామని, రైతుల వద్ద ఉన్న ప్రతి వరి గింజను కొనుగోలు చేశామని పేర్కొన్నారు. తెలంగాణ నుంచి కొనుగోలు చేసే వరిని కేంద్రం ఏటా తగ్గిస్తోందని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో వరి ఉత్పత్తి పెంచుతుంటే కేంద్ర మాత్రం కొనుగోలు చేయడం లేదని, కేంద్రం కోటా తగ్గించినా ఎంఎస్‌పీ ప్రకారం కొనుగోలు చేస్తున్నామని తెలిపారు.

# స్వయం సహాయక బృందాలకు 553 ఆర్టీసీ బస్సులు

మొదటి పేజీ తరువాయి...

నడిపిస్తున్నారు. అంబానీ, అదానీతో పోటీ పడి మా ఆడబిడ్డలు విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. కోటి మంది అడబిడ్డలను కోటీశ్వరులను చేయాలని ఈ ప్రభుత్వం కంకణం కట్టుకుంది" రేవంత్ రెడ్డి, సీఎం

ఆర్టీసీకి రూ.10,500 కోట్లు చెల్లించాం : ఇందిరమ్మ రాజ్యం వస్తేనే మహిళలకు గుర్తింపు ఉంటుందని, గత ప్రభుత్వం మహిళలకు ఇవ్వాల్సిన రూ.4వేల కోట్ల సున్నా వడ్డీ నగదును చెల్లించలేదని, మహిళలతో పెట్టుకున్న ఎవరైనా అధికారంలో ఉంటారా? అని ప్రశ్నించారు. మహిళలతో పెట్టుకున్నందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఓడిపోయిందని తెలిపారు. మహిళల ఉచిత ప్రయాణం కోసం ఆర్టీసీకి రూ.10,500 కోట్లు చెల్లించామని స్పష్టం చేశారు.

మహిళలను కోటీశ్వరులను చేస్తాం : ఆడబిడ్డలు ఉచితంగా బస్సులో పక్క ఊరు వెళ్లి చదువుకుంటున్నారని, ఫ్రీ బస్సు వల్ల స్కూళ్లల్లో ఆడపిల్లల డ్రాపవుట్లు తగ్గాయని తెలిపారు. అంబానీ, అదానీలకు పోటీగా పెట్రోల్ బంకులు, సోలార్ విద్యుత్‌ను రాష్ట్ర మహిళలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. త్వరలోనే జిల్లా మహిళా శక్తి భవనాలు నిర్మిస్తామని, హైటెక్‌సిటీ పక్కన రూ. వెయ్యి కోట్ల భూమిని మహిళా సంఘాలకు ఇచ్చామని వెల్లడించారు. రాష్ట్ర ఆర్థిక ప్రగతి మహిళల చేతిలో ఉందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం ఇచ్చిన బతుకమ్మ చీరలను ఏనాడైనా మహిళలు కట్టుకున్నారా? అని అడిగారు. తమ ప్రభుత్వం ఇచ్చిన చీర కట్టుకుని మహిళలు ఈ సభకు వచ్చారని, కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేసే వరకు విశ్రమించనని స్పష్టం చేశారు.

"బీజేపీ పార్టీ అధ్యక్ష పదవిని ఒక్కసారైనా మహిళలకు ఇచ్చారా?. బీఆర్ఎస్ ప్రభుత్వం తొలి ఐదేళ్లలో ఒక్క మహిళకూ మంత్రి పదవి ఇవ్వలేదు. మా ప్రభుత్వంలో ఇద్దరు మహిళలకు మంత్రి పదవులు ఇచ్చాం. గత ప్రభుత్వం మహిళలకు ఇవ్వాల్సిన రూ.4వేల కోట్ల సున్నా వడ్డీ నగదును చెల్లించలేదు. మహిళలతో పెట్టుకున్న ఎవరైనా అధికారంలో ఉంటారా? మహిళలతో పెట్టుకున్నందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఓడిపోయింది"

– రేవంత్ రెడ్డి, సీఎం

# పాత బస్తీలో మెట్రోకు తొలగిన అడ్డంకులు

హైదరాబాద్, జూన్ 9 (నమస్తే ఉదయం)

పాతబస్తీకి మెట్రోరైలు ఏర్పాటు కోసం కొన్నేళ్ల నుంచి ప్రభుత్వం పనులు ప్రారంభించింది. త్వరగా దీనిని పూర్తి చేసి మెట్రో సేవలను అందించేలా ముందడుగు వేస్తోంది. దానికి అనుగుణంగానే తాజాగా మెట్రోరైలు కోసం చేపట్టిన భూసేకరణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. దాదాపు 93 శాతం మేర భూసేకరణ జరిగినట్లు అధికారులు తెలిపారు.

మిగతావి కోర్టు కేసుల్లో : భూసేకరణలో మొత్తం 888 ఆస్తులు ఉండగా 825 వరకు సేకరణ జరిగింది. మిగిలిన వాటిలో మూడు పురాతన కట్టడాలు వారసత్వ కట్టడాల సంరక్షణ కమిటీ పరిశీలనలో ఉన్నాయి. 10 కోర్టు కేసుల్లో ఉన్నాయి. మరిన్ని ఆస్తుల వివాదాలు ప్రధాన భూపరిపాలన కమిషనర్ (సీసీఎల్ఏ)లోని భూసేకరణ, పునరావాసం, రీ సెటిల్‌మెంట్ అథారిటీ (ఎల్ఏఆర్ఆర్ఏ) పరిధిలో ఉన్నాయి. ఇవి మినహా మిగతా ఆస్తుల సేకరణ అలాగే ఇవ్వాల్సిన పరిహారం కూడా పంపిణీ అయ్యిందని అధికారులు చెప్పారు.

మెట్రోరైలు రెండోదశ : మెట్రోరైలు రెండోదశలో భాగంగా ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణ గుట్ట వరకు విస్తరించనున్నారు. మొత్తం 7.5 కిలోమీటర్ల మేర దీనిని నిర్మించనున్నారు. ఈ మార్గం దారుల్‌షిఫా, పురానీహవేలీ, అలీజా కోట్ల, హరిబౌలి, షాలిబండ, షంషీర్‌గంజ్, ఫలక్‌నుమా మీదుగా చాంద్రాయణగుట్ట వరకు ఉంటుంది. ఈ మార్గంలో మొత్తం 105 వరకు మత, చారిత్రక కట్టడాలు ఉన్నాయి. వాటికి ఏమాత్రం హాని కలగకుండా ఆస్తులు సేకరించినట్లు అధికారులు వెల్లడించారు. అలాగే వ్యక్తిగత ఆస్తుల సేకరణ పూర్తైయినట్లు తెలిపారు.

వక్ఫ్ ఆస్తులు ఎల్ఏఆర్ఆర్ఏలో : మెట్రోరైలు సంస్థ సేకరిస్తున్న వాటిలో వక్ఫ్ ఆస్తులు ఉన్నాయి. గతంలో ఇవి వక్ఫ్ ఆస్తులని తెలియక కొంతమంది వీటిని కొనుగోలు చేశామని తెలిపారు. ఈ క్రమంలో మెట్రో భూసేకరణకు నోటీసులు ఇవ్వటంతో గొడవలు ఏర్పడ్డాయి. అయితే



ప్రస్తుతం ఈ కేసులన్నీ ఎల్ఏఆర్ఆర్ఏలో పరిధిలో ఉన్నాయి. రూ. 820 కోట్ల వరకు పరిహారం : ఇప్పటివరకు ఆస్తుల సేకరణలో భాగంగా బాధితులకు రూ. 820 కోట్లు పరిహారం చెల్లించినట్లు అధికారులు తెలిపారు. పరిహారం చెల్లించిన ఆస్తులను స్వాధీనం చేసుకుని ఇప్పటికే కూల్చివేతలు ప్రారంభించారు. అలియాబాద్ వంటి ప్రాంతాల్లో త్వరలో కూల్చివేతలు చేపట్టి రహదారి విస్తరణ చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. ఆస్తుల సేకరణ కొనసాగుతుండగానే పాతబస్తీ మెట్రో పనులు పరిశీలించేందుకు జనరల్ కన్సల్టెన్సీకి టెండర్లు పిలిచారు. నిర్మాణ గడువు, టెండర్ల ప్రక్రియ : హైదరాబాద్ పాతబస్తీ మెట్రో ప్రాజెక్ట్ (కారిడార్ 6) నిర్మాణ గడువు అలాగే టెండర్ల ప్రక్రియ అత్యంత వేగంతో జరుగుతోంది. హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ ఈ ప్రాజెక్ట్ పర్యవేక్షణ కోసం అంతర్జాతీయ జనరల్ కన్సల్టెంట్ నియామకానికి గ్లోబల్ టెండర్లను ఆహ్వానించింది. దీని బిడ్డింగ్ గడువు జూన్ 19, 2026 వరకు ఉంది. రోడ్డు విస్తరణ కోసం మిగిలిన 10 శాతం ఆస్తుల సేకరణను జూన్ 2026 నాటికి పూర్తి చేయడమే లక్ష్యంగా అధికారులు పనిచేస్తున్నారు. డిజైన్ అండ్ బిల్డ్ పద్ధతిలో ప్రధాన సివిల్ పనుల టెండర్లను ఖరారు చేయనున్నారు. ఆ తర్వాత క్షేత్రస్థాయిలో పిల్లర్ల నిర్మాణాన్ని వేగవంతం చేయనున్నారు. రాబోయే 3,4 ఏళ్లలోగా ఈ మార్గంలో వాణిజ్య మెట్రో రైలు సర్వీసులను పూర్తిగా అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్దేశించుకుంది.



# దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలి

మొదటి పేజీ తరువాయి...

అభివృద్ధి, పెండింగ్ ప్రాజెక్టులపై సీఎం రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి బహిరంగ సవాల్ విసిరారు. "రేవంత్ రెడ్డికి దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలి. ప్రెస్ క్లబ్ అయినా సరే లేదా అమరవీరుల స్తూపం ముందైనా సరే నేను చర్చకు సిద్ధం" అని ప్రకటించారు. తాను తెలంగాణకు రావాల్సిన ఏ ఒక్క ప్రాజెక్టునైనా అడ్డుకున్నానని నిరూపిస్తే తక్షణమే రాజీనామా చేస్తానని, దీనిపై సీనియర్ జర్నలిస్టులతో ఒక కమిటీని వేసి విచారణ జరిపించాలని సవాల్ విసిరారు.

తుమ్మిడిహట్టి ప్రాజెక్టు, మెట్రో ఫేజ్–2 పై సీఎం చేసిన ఆరోపణలను ఆయన తిప్పికొట్టారు. మెట్రో ఫేజ్–2 ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే సూత్రప్రాయ ఆమోదం తెలిపిందని వెల్లడించారు. తుమ్మిడిహట్టి అపాయింట్‌మెంట్ వ్యవహారంపై రేవంత్ రెడ్డి ఆధారాలు లేని ఆరోపణలు మానేసి, పద్ధతిగా అధికారికంగా అపాయింట్‌మెంట్ కోరాలని సూచించారు. గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు తమ అవినీతి, తప్పుడు నిర్వహణతో మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణను అప్పుల పాలు చేశాయని కిషన్ రెడ్డి విమర్శించారు.

# మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ

మొదటి పేజీ తరువాయి...

ఎదుర్కొంటున్న వ్యక్తికి మీనాక్షి రాజకీయ అండదండలు అందించారని ఎ.శ్రీలత అనే మాజీ కార్పొరేట్ ఎగ్జిక్యూటివ్ ఆ పిటిషన్‌లో ఆరోపించారు. ఈ విషయాన్ని నామినేషన్‌లో ప్రస్తావించలేదని బీజేపీ అభ్యంతరం వ్యక్తం చేసింది. అయితే, బీజేపీ ఆరోపణలను కాంగ్రెస్ నేత ఉమంగ్ సింఘార్ "బలవంతపు రాజకీయాలు"గా అభివర్ణించారు. మీనాక్షిపై ఎలాంటి కేసు నమోదు కాలేదని, కేవలం కోర్టు నుంచి నోటీసు మాత్రమే అందిందని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం కేసు నమోదైతేనే వివరాలు వెల్లడించాలి తప్ప, నోటీసుకు కాదని వాదించారు. ఇదంతా తన ప్రతిష్ఠకు భంగం కలిగించేందుకు చేస్తున్న రాజకీయ కుట్ర అని మీనాక్షి నటరాజన్ అన్నారు.

"ఒక గాంధేయవాద మహిళను చూసి బీజేపీ భయపడుతోంది" అని ఉమంగ్ సింఘార్ ఎక్స్ వేదికగా విమర్శించారు. "వారి నినాదం 'నారీ వందన్', కానీ నైజం 'నారీ అపమాన్'.. ఇదే బీజేపీ అసలు స్వరూపం" అని దుయ్యబట్టారు. సత్యం, రాజ్యాంగం, ప్రజాభిప్రాయం శక్తితో తాము విజయం సాధిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.


మీనాక్షి నటరాజన్ ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జిగా కొనసాగుతుండడం తెలిసిందే.

# ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో భారీగా తహసీల్దార్ ల బదిలీలు

**ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో భారీగా తహసీల్దార్లు (ఎమ్మార్వోలు) బదిలీ అయ్యారు. ఒకే సారి 25 మంది తహసీల్దార్లను బదిలీ చేస్తూ రెవెన్యూ శాఖ కార్యదర్శి డీఎస్ లోకేష్ కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనా అవసరాల దృష్ట్యా ఈ బదిలీలు జరిగాయని జారీ చేసిన ఉత్తర్వుల్లో ఆయన స్పష్టం చేశారు**

గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 9(నమస్తే ఉదయం)


జోగుళాంబ గద్వాల జిల్లాలో పనిచేస్తున్న తహసీల్దార్‌లను బదిలీ చేశారు. . కలెక్టరేట్‌లో పనిచేస్తున్న తహసీల్దార్‌లతో పాటు వివిధ మండలాల్లో పనిచేస్తున్నవారిని బదిలీలు చేశారు. దీర్ఘకాలికంగా ఒకేచోట పనిచేస్తున్న వారికి కూడా బదిలీ ఉత్తర్వులు ఇచ్చారు. వెంటనే కేటాయించిన స్థానాల్లో చేరాలని ఆదేశించారు. బదిలీ అయిన వారిలో జి.వేణుగోపాల్ రెడ్డి, బి.విజయ్ కుమార్(గట్టు),కరుణాకర్(కేటిదొడ్డి), ఎస్ కే. నదీమ్, జి.విమోచన లు జోగుళాంబ గద్వాల జిల్లా నుంచి వనపర్తి జిల్లాకు బదిలీ అయ్యారు.



పిల్లర్ నెంబర్ 191 ఉప్పర్ పల్లి వద్ద రోడ్డు పై ఆగిన వరద నీరు

**మంగళవారం సాయంత్రం కురిసిన వర్షానికి ఉప్పర్ పల్లి పిల్లర్ నెంబర్ 191 వద్ద, శివరాంపల్లి వాల్మార్ట్ వద్ద, ఆరాంఘర్ రాందేవ్ బాబా మందిరం వద్ద, ఆరాంఘర్ రైల్వే బ్రిడ్జి ప్రాంతంలో వరద నీరు చేరి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలిగాయి. రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ కె రామక్రిష్ణ, ఇన్స్పెక్టర్ సీహెచ్ రాజు లు ఆయా ప్రాంతాలలో తమ సిబ్బంది తో కలసి వాహనాలు వెళ్లడానికి ట్రాఫిక్ ను క్లియర్ చేశారు.**

**బుద్వేల్, నమస్తే ఉదయం**



ట్రాఫిక్ ను క్లియర్ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

# నార్మ్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రముఖ వ్యవసాయ జీవసాంకేతిక శాస్త్రవేత్త డాక్టర్ రామన్ మీనాక్షి సుందరం

**బుద్వేల్, జూన్ 9 (నమస్తే ఉదయం) :**

భారత వ్యవసాయ పరిశోధన రంగంలో విశిష్ట సేవలు అందించిన అంతర్జాతీయ ఖ్యాతి గాంచిన వ్యవసాయ శాస్త్రవేత్త, వరి జీవసాంకేతిక నిపుణుడు, పరిశోధన పరిపాలనలో దూరదృష్టి కలిగిన నాయకుడు డాక్టర్ రామన్ మీనాక్షి సుందరం నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్మెంట్ (నార్మ్), హైదరాబాద్ డైరెక్టర్ గా బాధ్యతలు స్వీకరించారు. మూడు దశాబ్దాలపాటు భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐ సీ ఏ ఆర్) వ్యవస్థలో విశిష్ట సేవలందించిన డాక్టర్ రామన్ మీనాక్షి సుందరం శాస్త్రీయ పరిశోధనలు, సాంకేతిక ఆవిష్కరణలు, సంస్థాగత అభివృద్ధి, జాతీయ స్థాయి పరిశోధన సమన్వయంలో తనదైన ముద్ర వేశారు. అంతకుముందు ఆయన ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్ (ఐ ఐ ఆర్ ఆర్), హైదరాబాద్ డైరెక్టర్ గా సేవలందిస్తూ వరి పరిశోధన, జన్యు అభివృద్ధి, సాంకేతిక విస్తరణ కార్యక్రమాలకు నూతన దిశానిర్దేశం చేశారు. తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయం నుండి బి.ఎస్సి (అగ్రికల్చర్), పంత్ నగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుండి మాలిక్యులర్ బయాలజీ, బయోటెక్నాలజీలో ఎం ఎస్సీ, హైదరాబాద్ విశ్వవిద్యాలయం నుండి ప్లాంట్ సైన్సెస్ లో పీహెచ్డీ పూర్తి చేసిన డాక్టర్ రామన్ మీనాక్షి సుందరం, పంటల జీవసాంకేతికత, మాలిక్యులర్ బ్రీడింగ్, జన్యుశాస్త్రం, జీనోమిక్స్ ఆధారిత పంటాభివృద్ధి రంగాల్లో విశేష కృషి చేశారు. ఆయన నాయకత్వంలో అభివృద్ధి చెందిన "ఇంప్రూవ్డ్ సాంబా మహ్సూరి" వరి రకం భారత వ్యవసాయ పరిశోధన చరిత్రలో మైలురాయిగా నిలిచింది. బ్యాక్టీరియల్ బ్లైట్ వ్యాధిని తట్టుకునే సామర్థ్యంతో పాటు సాంబా మహ్సూరి ప్రత్యేక ధాన్య నాణ్యతను కొనసాగిస్తూ రూపొందించిన ఈ రకం లక్షలాది మంది రైతులకు ప్రయోజనం చేకూర్చింది. ఇది భారతదేశంలో మాలిక్యులర్ బ్రీడింగ్ విజయగాథలకు ప్రతీకగా నిలిచింది. డాక్టర్ రామన్ మీనాక్షి సుందరం వందలాది పరిశోధనా వ్యాసాలను అంతర్జాతీయ జర్నల్స్ లో ప్రచురించగా, వేలాది శాస్త్రీయ ఉల్లేఖనాలు ( సైటేషన్) పొందారు. ఆయన కృషికి గుర్తింపుగా ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐ సీ ఏ ఆర్) లాల్ బహదూర్ శాస్త్రి అవుట్ స్టాండింగ్ యంగ్ సైంటిస్ట్ అవార్డు, హరి ఓం ఆశ్రమ్ ట్రస్ట్ అవార్డు, సీ ఎస్ ఐ ఆర్ గ్రామీణాభివృద్ధి విజ్ఞాన సాంకేతిక అవార్డు, డీ బి టీ ప్రొడక్ట్ , ప్రాసెస్ కమర్షియలైజేషన్ అవార్డు సహా అనేక జాతీయ పురస్కారాలు ఆయనకు లభించాయి. ఇప్పుడు నార్మ్ డైరెక్టర్ గా ఆయన నియామకం ద్వారా వ్యవసాయ పరిశోధన నిర్వహణ, విధాన రూపకల్పన, ఆవిష్కరణ వ్యవస్థలు, వ్యవసాయ వ్యవస్థాపకత, మానవ వనరుల అభివృద్ధి మరియు సామర్థ్య వృద్ధి రంగాల్లో సంస్థ మరింత ఉన్నత స్థాయికి చేరుకుంటుందని శాస్త్రవేత్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. 'వికసిత భారత్-2047" లక్ష్యాల సాధనకు అవసరమైన భవిష్యత్ వ్యవసాయ ఆవిష్కరణలు, నాయకత్వ నిర్మాణం మరియు శాస్త్రసాంకేతిక ఆధారిత వ్యవసాయ రూపాంతరానికి డాక్టర్ సుందరం నాయకత్వం నార్మ్ కు ఒక కొత్త అధ్యాయమని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.



నార్మ్ డైరెక్టర్ కార్యాలయం


డాక్టర్ రామన్ మీనాక్షి సుందరం




వివరాలు వెల్లడిస్తున్న అత్తాపూర్ పోలీసులు

# వృత్తి విద్యార్థి, ప్రవృత్తి తాళం వేసిన ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడటం

**నాలుగు కేసులలో సంబంధం ఉన్న ఓ నిందితుణ్ణి అరెస్ట్ చేసిన అత్తాపూర్ పోలీసులు**

**బుద్వేల్, జూన్ 9 (నమస్తే ఉదయం)**

తాళం వేసిన ఇళ్లలలో బెలీనో కారుతో వెళ్లి దొంగతనాలకు పాల్పడుతున్న ఓ విద్యార్థి ని అత్తాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి మంగళవారం రిమాండ్ కు తరలించారు.అతని నుంచి బంగారు, వెండి అభరణాలను స్వాధీనం చేసుకున్నారు. వివరాలను రాజేంద్రనగర్ ఏసీపీ తుల శ్రీనివాస్ విడుదల చేసిన ఓ ప్రకటన లో వెల్లడించారు. సీతారంబాగ్ అఫ్టల్సాగర్ ప్రాంతానికి చెం దిన శ్యాంసుందర్ శుక్లా కుమారుడు రిషబ్ శుక్లా (21) చదువుకుంటున్నాడు. 2026 మే 26న బెలీనో కారు టీజీ 07 ఏబీ 3706 నెంబరు ను అద్దెకు తీసుకున్నాడు. 27వ తేదీన ఉదయం హైదరరీడ న్యూ ఫ్రెండ్స్ కాలనీలో తాళం వేసిన ఇంట్లో చోరి కి పాల్పడ్డాడు. మే 28న అత్తాపూర్ తేజస్వీని నగర్ కాలనీలో తాళం వేసిన ఇంట్లో చోరికి పాల్పడ్డాడు. మే 31న ఉదయం హైదర్ గూడ నందనవనం అపార్ట్మెంట్ లో చోరీ కి పాల్పడ్డాడు. అత్తాపూర్ పోలీసులు విశ్వసనీయ సమాచారం మేరకు నిందితుని అరెస్ట్ చేశారు. అతని ను ంచి బంగారు, వెండి అబరణాలను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం రిమాండ్ కు తరలించారు.




విద్యుత్ కొత్త లీడర్ ను ప్రారంభిస్తున్న ఎస్ ఈ శ్రీరామ్ మోహన్

# విద్యుత్ లోడ్‌కు అనుగుణంగా మౌలిక సదుపాయాల పెంపు; ఎస్ ఈ శ్రీ రామ్మోహన్

**రాజేంద్రనగర్, జూన్ 9(నమస్తే ఉదయం)**

విద్యుత్ వినియోగదారులు రోజురోజుకు విద్యుత్ ను వినియోగించడంలో లోడు పెరుగుతుందని అందుకు అనుగుణంగా విద్యుత్తు సబ్ స్టేషన్ల సామర్థ్యం పెంచుతున్నామని రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ ఎస్ ఇ శ్రీరామ్ మోహన్ తెలిపారు. మంగళవారం రాజేంద్రనగర్ విద్యుత్ డివిజన్ పరిధిలోని శివరాంపల్లి సెక్షన్ పరిధిలో గల పహడి విద్యుత్ ఫీడర్ ను వేరు చేసి కొత్తగా ప్యారడైజ్ ఫీడర్ ను సుమారు 50 లక్షలు రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఫీడర్ ను ఆయన డివిజన్ డి ఈ పి రత్నాకర్ రావు, డి ఈ (లైన్స్) చంద్రశేఖర్, డి ఈ (ప్రొటెక్షన్) భాస్కర్ రావు లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ ఈ శ్రీరామ్ మోహన్ మాట్లాడుతూ... విద్యుత్ సరఫరా లో అంతరాయం లేకుండా మౌలిక వసతులు కల్పించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. రోజురోజుకు పెరుగుతున్న జనాభా కు అనుగుణంగా విద్యుత్తు సామర్థ్యాన్ని పెంపొందించి ప్రజలకు నిరంతర సరఫరా అందించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు.ప్రభుత్వం వినియోగదారులకు నిరంతర, నాణ్యమైన విద్యుత్తు కోట్లాది రూపాయలు వెచ్చించి తరపరా చేస్తుందని అందుకోసం వినియోగదారులు తమ బిల్లులను సకాలంలో చెల్లించి అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. ప్రస్తుతమున్న పహడి విద్యుత్ ఫీడర్ 160ఏ గరిష్ట లోడ్‌కు చేరుకున్న 11 కె.వి పహాడీ ఫీడర్ నుండి విభజించి ప్యారడైజ్ ఫీడర్‌ను ఏర్పాటు చేశామన్నారు.. ఈ కార్యక్రమంలో ఏడీఈ సత్యనారాయణ, ఏఈ నవీన్ లు పనులను చేపట్టారు. ఎం ఎం పహాడీ, సులేమాన్‌నగర్, చింతల్‌మెట్ , ఖయ్యమ్‌నగర్ లలో సుమారు 4500 మంది వినియోగదారులు లబ్ధి పొందుతారన్నారు.



# అర్బన్ హెల్త్ సెంటర్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

**మాజీ కౌన్సిలర్ ఎస్ వెంకటేష్**

**రాజేంద్రనగర్, జూన్ 9(నమస్తే ఉదయం)**

మైలార్ దేవ్ పల్లి అర్బన్ హెల్త్ సెంటర్ లో మౌలిక సదుపాయాలు కల్పించాలని మాజీ కౌన్సిలర్, టిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు ఎస్ వెంకటేష్ కోరారు. మంగళవారం మైలార్ దేవ్ పల్లి లో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో సరైన సదుపాయాలు లేక రోగులు అవస్థలకు గురవుతున్నారని ఆయన తెలిపారు.ప్రజా పాలనలో పడకేసిన ప్రభుత్వ ఆసుపత్రులు... వైద్యమో నారాయణ అంటున్నారని ఆయన గుర్తు చేశారు.రాజేంద్రనగర్ నియోజకవర్గం కాటేదాన్ డివిజన్ పరిధి కాటేదాన్ లో బస్తి బాట కార్యక్రమంలో భాగంగా బిఆర్ఎస్ ముఖ్య నాయకులతో కలిసి కాటేదాన్ డివిజన్ అధ్యక్షులు ఎస్ వెంకటేష్ ఆధ్వర్యంలో మైలార్ దేవ్ పల్లి బస్తీ లోని. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం దవాఖానాను సందర్శించారు.ఈ సందర్భంగా వెంకటేష్ నాయకులు కలిసి దవాఖానాల్లో మౌలిక వసతులు సదుపాయము చికిత్స, రోగుల స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ ... దవాఖాన పరిసర ప్రాంతంలో పరిశుభ్రత లోపించిందన్నారు. దవాఖానాలో విద్యుత్ సరఫరా లేక మండుటెండలో వచ్చిన వారికి సరైన వెలుతురు లేక ఫ్యాను లేక ఉక్కపోతతో వచ్చిన రోగులతో పాటు సిబ్బంది కి తీవ్ర ఇబ్బంది కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దవాఖానకు వచ్చిన రోగులకు అసౌకర్యం లేకుండా అన్ని విధాల సౌకర్యాలు ఉండేటట్లు చూడాలని స్థానిక ఎమ్మెల్యే ని అదేవిధంగా సంబంధిత అధికారులను కోరారు.దవాఖానను సందర్శించిన వెంకటేష్ , నాయకులు ఆసుపత్రికి వచ్చిన రోగులకు మంచినీళ్లు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రమేష్ ముదిరాజ్ రాము యాదవ్ రాఘవేందర్ యాదవ్ రాజేష్ యాదవ్ మైసిరెడ్డి, అరుణ రెడ్డి, సరిత మహేష్, కొంపల్లి జగదీష్ అశోక్ కుమార్ ప్రవీణ్ వెంకటరమణ యాదగిరి భాస్కర్ అనిల్ నాని చారి రవి రిషి బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.




# ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలి..

**బడి బాటలో తల్లిదండ్రులకు ఉపాధ్యాయుల వినతి**

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 9(నమస్తే ఉదయం):**

ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం ధరూర్ మండలం జాంపల్లి ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం పి.రేవతి ఆధ్వర్యంలో విద్యార్థుల ప్రవేశాల కోసం ఇంటింటా ప్రచారం కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో అన్ని సౌకర్యాలు ఉన్నాయని, విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో ధరూర్ సిపిఎస్ పాఠశాల ఎల్ఎఫ్ఎల్ హెడ్ మాస్టర్ యోగేందర్,అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ ఖాజాబి,కాంప్లెక్స్ సిఆర్పీ డి. నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

# తొలి వర్షాల నేపథ్యంలో తాగునీటి నాణ్యత పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి

**క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి..**

**ఆదేశించిన జలమండలి ఎండీ అశోక్ రెడ్డి**

**రాజేంద్రనగర్,జూన్09(నమస్తే ఉదయం)**




నైరుతి రుతుపవనాల ఆగమనంతో నగరంలో వర్షాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో తాగునీటి నాణ్యతను పరిరక్షించేందుకు జలమండలి అధికారులు,సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి ఆదేశించారు.వర్షాకాలంలో తాగు నీరు కలుషితం అవకాశం ఉ ఒడటంతో పంపిణీ వ్యవస్థలో అన్ని స్థాయిలలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.తొలి వర్షాల సమయంలో స్లూయిస్ వాల్వ్ ఛాంబర్లలో వర్షపు నీరు చేరే అవకాశం ఉన్నందున నీటి సరఫరా ప్రారంభించే ముందు తప్పనిసరిగా స్కవర్ వాల్వ్‌లను నిర్వహించి లైన్లను శుభ్రపరచాలని ఎండీ ఆదేశించారు.జలమండలి పరిధిలోని అన్ని వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు,రిజర్వాయర్లు,పంపిణీ నెట్‌వర్క్ శాంప్లింగ్ పాయింట్ల వద్ద నీటి నాణ్యత పరీక్షలను మరింత ముమ్మరం చేయాలని ఆదేశించారు.అలాగే క్లోరిన్ పరీక్షలు క్రమం తప్పకుండా నిర్వహించడంతో పాటు రా వాటర్..శుద్ధి చేసిన నీటిలో టర్బిడిటీ స్థాయిలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. వినియోగదారుల వద్ద కనీసం 0.2 పిపిఎం ఉండేలా చర్యలు తీసుకోవాలని,కలుషిత నీరు సరఫరా అవకాశం ఉన్న ప్రాంతాల్లో క్లోరినేషన్ మోతాదును అవసరానికి అనుగుణంగా పెంచాలని తెలిపారు.క్లోరినేషన్ పరికరాలు సక్రమంగా పనిచేసేలా చూడటంతో పాటు బ్లీచింగ్ పౌడర్,క్లోరిన్ నిల్వలు తగిన మోతాదులో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.కాలువలు,నాలాలు,నీరు నిలిచే ప్రాంతాల సమీపంలో ఉన్న పైప్‌లైన్‌లను ప్రత్యేకంగా తనిఖీ చేయాలని,లీకేజీలు,దెబ్బతిన్న పైపులు,లోపభూయిష్ట వాల్వ్‌లను వెంటనే మరమ్మతు చేయాలని సూచించారు.ఎయిర్ వాల్వ్‌లు,స్కవర్ వాల్వ్‌లు,ఛాంబర్లలో వర్షపు నీరు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.రిజర్వాయర్లు,సర్వీస్ ట్యాంకుల మూతలు,వెంటిలేటర్లు,మ్యాన్‌హోల్‌లను పూర్తిగా సీలింగ్ చేసి వర్షపు నీరు,కీటకాలు,ఇతర కాలుష్య కారకాలు లోనికి ప్రవేశించకుండా చర్యలు తీసుకోవాలని ఎండీ సూచించారు.లో ప్రెషర్ ఉన్న ప్రాంతాలను గుర్తించి పొల్యూషన్ జరగకుండా పంపిణీ వ్యవస్థలో ఎల్లప్పుడూ తగిన ఒత్తిడిని కొనసాగించాలని ఆదేశించారు.నీరు నిలిచే కీలక ప్రాంతాల్లో ప్రత్యేక ఫీల్డ్ బృందాలను మోహరించాలని,ముంపు ప్రాంతాల గుండా వెళ్లే పైప్‌లైన్‌లను నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు.సివరేజ్ పనుల్లో సమన్వయంగా పనిచేస్తూ నీటి పైప్‌లైన్‌లు,సీవరేజ్ లైన్లు సమాంతరంగా ఉన్న ప్రాంతాలను ప్రత్యేకంగా పర్యవేక్షించాలని,సీవరేజ్ ఓవర్‌ఫ్లోలు,లీకేజీలను అత్యవసర ప్రాధాన్యతతో పరిష్కరించాలని ఆదేశించారు.ఎట్టి పరిస్థితుల్లోనూ మురుగునీరు తాగునీటి వ్యవస్థలోకి ప్రవేశించకుండా చూడాలని పేర్కొన్నారు.కలుషిత నీరు సరఫరా ప్రభావిత ప్రాంతాల్లో అవసరమైతే ప్రజలు నీటిని మరిగించి వినియోగించేలా అవగాహన కల్పించాలని సూచించారు.పైప్‌లైన్ ధ్వంసం అయినా,పొల్యూషన్ ఘటనలు ఎదురైనప్పుడు స్పందించేందుకు ఏఎంఎస్ బృందాలు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని,అవసరమైతే ట్యాంకర్ల ద్వారా ప్రత్యామ్నాయ తాగునీటి సరఫరా ఏర్పాటు చేయాలని ఆదేశించారు.వర్షాల ప్రభావం వల్ల నీటి నాణ్యత,లీకేజీలు,ప్రజా ఫిర్యాదులపై ప్రతిరోజూ సమీక్ష నిర్వహించి సంబంధిత నివేదికలను ఉ న్నతాధికారులకు సమర్పించాలని ఎండీ తెలిపారు.అలాగే అధికారులు,సిబ్బంది చివరి స్థాయి క్షేత్ర సిబ్బంది వరకు ఈ సూచనలను కచ్చితంగా అమలు చేయాలని,అదే విధంగా స్థానిక ప్రజాప్రతినిధులు,కాలనీ సంక్షేమ సంఘాలు,సమాజంలోని వివిధ వర్గాలతో సమన్వయం చేసుకుంటూ ప్రజల్లో అవగాహన పెంపొందించాలని అశోక్ రెడ్డి స్పష్టం చేశారు.


బయోచార్ ఎరువులను పరిశీలిస్తున్న ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ దండ రాజి రెడ్డి

# బయోచార్ వాడకం వల్ల నేల ఆరోగ్యాన్ని కాపాడవచ్చు

**బుద్వేల్, జూన్ 9 (నమస్తే ఉదయం)**

పంటల వ్యర్థాలు, అవశేషాలను ఉపయోగించి పైరోలిసిస్ విధానంలో తయారు చేసే బయోచార్ నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుందని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ దండ రాజిరెడ్డి అన్నారు. బయోచార్ వినియోగం ద్వారా పంటల దిగుబడి పెరగడమే కాకుండా, కార్బన్ నిల్వ సాధ్యమౌతుందని, ఇది క్లైమెట్ స్మార్ట్ సాగు దిశగా ఒక ముఖ్యమైన అడుగు అని ఆయన పేర్కొన్నారు. రాజేంద్రనగర్ లోని ఉద్యాన కళాశాలలో ఉన్న పూల పరిశోధన స్థానంలో బయోచార్ విధానం పై ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమం లో ఆయన మంగళవారం పాల్గొని ప్రసంగించారు. నేల సారాన్ని పెంపొందించడం, నీటి నిల్వ సామర్థ్యాని పెంచడం, సూక్ష్మజీవుల క్రియాశీలతకు మద్దతు ఇవ్వడం బయోచార్ వాడకం తో ముడిపడి ఉన్నాయని అన్నారు. రసాయన ఎరువులపై ఆధారాన్ని తగ్గించడం, వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడంలో బయోచార్ వాడకం భవిష్యత్తులో ప్రధాన ఆయుధంగా ఉండనుందన్నారు. రైతులు, శాస్త్రవేత్తలు, విద్యార్థులు కలసి బయోచార్ ఆధారిత సాంకేతికతలను విస్తృతంగా వినియోగించుకోవాలని అన్నారు. ఉద్యాన విశ్వవిద్యాలయం ఈ దిశగా పరిశోధన, శిక్షణ, అవగాహన కార్యక్రమాలను మరింత బలోపేతం చేస్తుందని డాక్టర్ దండ రాజిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో బయోచార్ నిపుణులు డాక్టర్ ఆరిఫ్ ఖాన్ రిజిస్ట్రార్ డాక్టర్ భగవాన్, పూల పరిశోధన స్థానం హెడ్ డాక్టర్ జ్యోతి, కూరగాయల డాక్టర్ అనిత అనిత కుమారి, ఉద్యాన ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ప్రశాంత్ లు పాల్గొన్నారు.

# గండిగూడెం చెరువు అభివృద్ధికి చర్యలు

## కాలుష్య కారక జలాలు చేరకుండా ప్రత్యేక కాలువ:ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి





**పటాన్ చెరు, జూన్ 9 (నమస్తే ఉదయం):**

అమీన్పూర్ డివిజన్ పరిధిలోని గండిగూడెం చెరువులోకి కాలుష్య జలాలు చేరకుండా ప్రత్యేక కాలువ నిర్మించనున్నట్లు పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం గండిగూడెం చెరువులో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ప్రధానంగా చెరువు అలుగు పెంచడం మూలంగా సమీపంలోని ఖాజిపల్లి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వర్షాకాలంలో నీటిమట్టం పెరిగి ఇళ్ళలోకి నీళ్లు చేరుతున్నాయని ఇటీవల ప్రజలు తన దృష్టికి తీసుకొని రావడం జరిగిందని పేర్కొన్నారు. అలుగు మట్టాన్ని పూర్వస్థితికి తీసుకుని రావడంతో పాటు.. పరిశ్రమల నుండి కాలుష్య జలాలు చెరువులోకి చేరకుండా చెరువు సమీపం నుండి ప్రత్యేక కాలువ నిర్మించి వాటిని బయటకు పంపించడం జరుగుతుందని తెలిపారు. పరిశ్రమలు కాలుష్య జలాలు వదలకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు భాస్కర్ గౌడ్, రాజు, గణేష్, నవీన్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# జమ్మిచేడు శ్రీ జములమ్మ దేవాలయంలో 'హలాల్' విధానాన్ని నిషేధించి, సాంప్రదాయ 'జట్కా' పద్ధతిని అమలు చేయాలి






## ఆలయ ఈఓ పురేందర్‌కు విహెచ్‌పి, బజరంగ్ దళ్ వినతిపత్రం

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 9(నమస్తే ఉదయం):**

గద్వాల పట్టణ పరిధిలోని జమ్మిచేడులో గల శ్రీ జములమ్మ దేవాలయంలో జంతు బలుల విషయంలో హిందూ సాంప్రదాయాలను గౌరవించాలని విశ్వహిందూ పరిషత్ , బజరంగ్ దళ్ నాయకులు డిమాండ్ చేశారు. ఆలయంలో ప్రస్తుతం కొనసాగుతున్న అన్యమత సాంప్రదాయమైన 'హలాల్' విధానాన్ని తక్షణమే నిషేధించాలని, దానికి బదులుగా హిందూ ధర్మ సాంప్రదాయోక్తమైన 'జట్కా' పద్ధతిని అమలు చేయాలని కోరుతూ మంగళవారం దేవాలయ కార్యనిర్వహణాధికారి (ఈఓ) పురేందర్ కు వారు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. శక్తి స్వరూపిణి అయిన అమ్మవారి క్షేత్రంలో హిందూ ఆచారాలకు విరుద్ధంగా హలాల్ పద్ధతిని ఉ పయోగించడం భక్తుల మనోభావాలను దెబ్బతీయడమేనని అన్నారు. శతాబ్దాలుగా వస్తున్న హిందూ ధర్మ సూత్రాల ప్రకారం కేవలం సాంప్రదాయ జట్కా పద్ధతిలోనే జంతు బలి ప్రక్రియ సాగాలని, ఈ విషయంలో ఆలయ యంత్రాంగం తక్షణమే స్పందించి తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి సి. ప్రవీణ్ కుమార్, బజరంగ్ దళ్ జిల్లా సంయోజక్ తిరుపతి మణి, కౌన్సిలర్ చంద్రశేఖర్, గాడ్సే మోహన్, వెంకటేష్,మనోజ్, శ్రీకాంత్,తిరుమలేష్ ,భాస్కర్, రాజు, పవన్ తదితర విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యాసంస్థల్లో మాదక ద్రవ్యాలపై నిఘా!

ఇటీవలి కాలంలో మాదక ద్రవ్యాల పట్టివేత ఆందోళన కలిగిస్తోంది. ఎక్కడికక్క నిత్యం ఎక్కో ఓ చోట మాదక ద్రవ్యాలు పట్టుబడుతూనే ఉన్నాయి. ఉమమడి తెలుగు రాష్ట్రాల్లో గంజాయి విపరీతంగా సరఫరా అవుతోంది. ఈగిల్ టీమ్‌లు పనిచేస్తున్నా, డ్రగ్స్ సరఫరా ఆగడం లేదు. చాపకింద నీరులా డ్రగ్స్ రవాణా సాగుతుతోంది. కాలేజీలు, స్కూళ్లు తెరుస్తున్న వేళ ప్రభుత్వాలు అప్రమత్తం కావాలి. మాదక ద్రవ్యాలు చిన్నారులను చిదిమేయకుండా చూడాలి. తల్లిదండ్రులు కూడా పిల్లల కదలికలను గమనిస్తూ ఉండాలి. ఎవరు ఎవరితో వెళుతున్నారు..ఎక్కడికి అన్నది గుర్తించాలి. మాదక ద్రవ్యాల ముఠాలు విద్యార్థులను లక్ష్యంగా చేసుకని వ్యాపారాలు చేస్తున్నాయి. కఠినంగా వ్యవహరించకపోతే యువత తీవ్ర ప్రమాదంలో పడేలా ఉంది. పిల్లల ప్రవర్తనను, వారు ఎక్కడెక్కడి వెళుతున్నారన్నది తల్లిదండ్రుల నిరతంరం గమనించాలి.

వారరు ఎవరి వలలో అయినా పడుతున్నారా అన్నది గుర్తించాలి. విద్యా సంస్థల్లో అవసరమైతే చెకింగ్స్ పెట్టాలి. ఈ రకంగా పిల్లలపై దుష్ప్రభావం చూపకుండా చేయాలి. మాదక ద్రవ్యాల ముఠాలు ఇప్పటికే ఐటి రంగాన్ని, సినిమా రంగాన్ని కేడా ప్రభావితం చేస్తున్నాయి. డ్రగ్స్ పార్టీలు కలకలం రేపుతున్నాయి. ఫామ్‌హౌజ్ పార్టీల్లో డ్రగ్స్ వాడకం పెరిగింది. ఇటీవల పలు కేసుల్లో ఇది నిరూపితం అయ్యింది. ఇతర దేశాలతో పోల్చితే భారతదేశంలో మాదకద్రవ్యాల వినియోగం తక్కువగా ఉంది. అయితే ప్రపంచ వ్యాప్తంగా మాదకద్రవ్యాల అక్రమ రవాణాలో భారత్ క్రమేణా కీలక పాత్ర వహిస్తోంది. సహజంగానే ఇది ఆందోళన కలిగించే అంశం. విశ్వవ్యాప్తంగా ఉత్పత్తి అవుతోన్న హెరాయిన్‌లో 95శాతం థాయిలాండ్, బర్మా, ఇరాన్, ఆఫ్ఘనిస్తాన్, పాకిస్థాన్ లలోనే ఉత్పత్తి అవుతోంది. ఈ దేశాల మధ్య ఉన్న భారత్‌కు మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టడం కత్తి మీద సాముగా ఉంది. మాదక ద్రవ్యాల అక్రమరవాణాకు భౌగోళికంగా భారత్ అనువుగా ఉంది. దీంతో అంతర్జాతీయ ముఠాలు భారత్‌పై



కన్నేసి ఉంచాయి. భారత్ నుంచి విదేశాలకు నిత్యం రాకపోకలు సాగించే ప్రవాసులను పావులుగా వాడుకోవడానికి ఆ మాఫియా ముఠాలు శతవిధాలుగా ప్రయత్నిస్తున్నాయి. మాదక ద్రవ్యాలన్నింటిలోనూ ఖరీదైన హెరాయిన్‌ను భారతదేశంలో ప్రతి రోజు సగటున 28 లక్షల మంది ఒక టన్ను మేరకు వినియోగిస్తున్నట్టు ఒక సర్వేలో వెల్లడయింది. కేంద్ర ప్రభుత్వమే స్వయంగా ఈ విషయాన్ని తెలిపింది. దీన్ని బట్టి మాదక ద్రవ్యాల వినియోగం ఎంతగా పెరిగిపోయిందో అర్థం చేసుకోవచ్చు. ఒక్క హెరాయిన్ ద్వారా భారత్‌లోకి ప్రతి సంవత్సరం 1.44 లక్షల కోట్ల రూపాయల సొమ్ము మనీలాండరింగ్ ద్వారా వస్తుందని కూడా కేందప్రభుత్వ అధ్వర్యంలోని జాతీయ మాదక ద్రవ్యాల నియంత్రణ సంస్థ అంచనా వేసింది. ఆరంభంలోనే ఈ అక్రమాన్ని నిర్మూలించడానికి సమగ్ర చర్యలు తీసుకోకపోతే తెలుగు రాష్ట్రాల, పంజాబ్‌కు తేడా లేకుండాపోతుంది. మరీ ముఖ్యంగా స్కూళ్లు, కాలేజీలు లక్ష్యంగా ముఠాలు పనిచేస్తున్నట్లు ఇటీవల గుర్తించారు. పిల్లు మాదక ద్రవ్యాలకు బానిసలైతే వారిని దారిలోకి తీసుకుని రావడం కష్టం. అందువల్ల ఈ ముఠాల మూలాలను కనుగొని వాటిని నిర్మూలించాల్సి ఉంది. తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రవాసులతో పాటుగా దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రవాసుల ద్వారా వారికే తెలియకుండా మాదక ద్రవ్యాలను విదేశాలకు సరఫరా చేస్తున్నట్లుగా ఇప్పటి వరకు బహిర్గతమైన కేసుల ద్వారా తెలుస్తోంది. గల్ఫ్ దేశాల్లో మాదక ద్రవ్యాల రవానా, సేవనం పై కఠిన ఆంక్షలు ఉన్నాయి. అక్కడ చాలామంది కఠిన శిక్షలకు గురవుతున్నారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నేరంపై గల్ఫ్ దేశాలలో ముఖ్యంగా కువైత్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రవాసులు అధిక సంఖ్యలో జైళ్ళలో మగ్గుతున్నారు. కువైత్ కేంద్ర కారాగారంలో మాదక ద్రవ్యాలకు సంబంధించిన నేరాలపై శిక్ష అనుభవిస్తున్న భారతీయ ఖైదీలలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారే అత్యధికంగా ఉన్నారు. హెరాయిన్ కంటే స్వల్ప ప్రభావం కలిగిన ఔషధ మందులు, గంజాయిని రవాణా చేస్తూ పట్టుబడ్డ వారు యు.ఏ.ఇ., ఖతర్ తదితర దేశాలలోని జైళ్ళలో మగ్గుతున్నారు. దురదృష్టవశాత్తు వీరి నేరాల విషయమై స్వదేశంలోని పోలీసులు లోతుగా విచారణ చేయలేకపోతున్నారు. కొన్ని కేసులలో దర్యాప్తునకు సహకరించడానికి కుటుంబ సభ్యులు ముందుకు రావడం లేదు. మరి కొన్ని కేసులలో స్మగ్లింగ్ ముఠాలు గల్ఫ్ జైళ్ళలో మగ్గుతున్న వారి కుటుంబ సభ్యులకు నెలకు కొంత మొత్తం పారితోషికం ఇస్తున్నారు. దీంతో సంబంధిత ఖైదీల కుటుంబాలు కూడా దర్యాప్తునకు సహకరించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. విదేశాలకు అక్రమ రవాణా అటుంచి స్వదేశంలోనూ మాదక ద్రవ్యాల వినియోగం పెరిగిపోతోంది. హైదరాబాద్‌తో సహా దేశవ్యాప్తంగా పలు నగరాలలో యువతీయువకులు మాదక ద్రవ్యాల వ్యసనానికి గురవుతున్నారు. గల్ఫ్‌లో పుట్టిపెరిగిన కొంత మంది పిల్లలను వారి తల్లిదండ్రులు ఉన్నత విద్యాభ్యాసానికై హైదరాబాద్‌కు పంపించడానికి డ్రగ్స్ కారణంగా భయపడుతున్నారు. ఈ క్రమంలో స్కూళ్లు, కాలేజీల్లో నిఘా పెంచాలి. పిల్లలు ఎవరితో వెళుతున్నారో గుర్తించాలి. కాలేజీలు, స్కూళ్ల పరిసరాల్లో సిసి కెమెరాలను పెంచాలి. దీంతో పిల్లల యోగక్షేమాలకు కూడా అవకాశం ఏర్పడుతుంది. దేశంలో యువతను డ్రగ్స్ మహమ్మారి నుంచి కాపడే యత్నం చేయాలి. డ్రగ్స్ రవాణాపై మరింత కఠనంగా వ్యవహరిస్తే తప్ప ఇది సాధ్యం కాదు.



# జూన్ 20న పదవ తరగతి ప్రతిభావంతులకు పురస్కారాల పంపిణీ

## 500 మంది విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

## ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్ చెరు, జూన్ 9 (నమస్తే ఉదయం)**

ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులను ప్రోత్సహించడంలో భాగంగా ఈ నెల 20వ తేదీన సైకిళ్ళు, ప్రశంసా పత్రాలు అందజేయనున్నట్లు పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం పటాన్ చెరు డివిజన్ పరిధిలోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని ఆయా మండలాల విద్యాశాఖ అధికారులు, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కరెస్పాండెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు పరీక్షల సమయంలో మానసిక స్థైర్యం పెంపొందించేందుకు వ్యక్తిత్వ వికాస నిపుణులతో శిక్షణ తరగతులు నిర్వహించడంతోపాటు పరీక్ష సామాగ్రి సైతం అందించడం జరుగుతోందని తెలిపారు. అదే విధంగా.. ఫలితాల్లో అత్యుత్తమ మార్పులు సాధించిన విద్యార్థులను సైతం ప్రోత్సహించాలన్న లక్ష్యంతో ప్రతి సంవత్సరం నగదు పురస్కారాలు పంపిణీ చేస్తున్నమని తెలిపారు. ఈ సంవత్సరం వినూత్నంగా సైకిళ్ళు పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని ప్రతి పాఠశాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విద్యార్థినీ విద్యార్థులకు పురస్కారాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 20వ తేదీ ఉదయం 10 గంటలకు పటాన్చెరు పట్టణంలోని మైత్రి మైదానంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు భారీ సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పటాన్చెరు మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు నాయక్, తదితరులు పాల్గొన్నారు.



# జమ్మిచేడు జమ్ములమ్మ ఆలయ వసతి గృహ నిర్మాణానికి రూ. 20 లక్షల భారీ విరాళం

## దాతలను సన్మానించిన ఆలయ ఈఓ పురేందర్ కుమార్.

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 9(నమస్తే ఉదయం):**

నడిగడ్డ భక్తుల ఇలవేల్పుగా పేరుగాంచిన గద్వాల పట్టణ పరిధిలోని జమ్మిచేడు శ్రీ జమ్ములమ్మ పరశురామ స్వామి దేవాలయంలో భక్తుల సౌకర్యార్థం చేపట్టిన వసతి గృహ నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయి. ఈ నిర్మాణ కార్య క్రమానికి గాను బెంగళూరు పట్టణానికి చెందిన విశ్వనాథం కుటుంబ సభ్యులు రూ. 20 లక్షల భారీ విరాళాన్ని మంగళవారం ఆలయ అధికారులకు అందజేశారు.ఈ సందర్భంగా విశ్వనాథం కుటుంబ సభ్యులు ఆలయాన్ని సందర్శించి, శ్రీజములమ్మ అమ్మవారికి,పరశురామ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వారికి తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు పలికారు.ఆలయ అభివృద్ధికి, దూరప్రాంతాల నుండి వచ్చే భక్తుల వసతి కొరకు ఇంతటి భారీ విరాళాన్ని అందజేసిన దాత విశ్వనాథం కుటుంబ సభ్యుల ఉదారతను ఆలయ కార్యనిర్వహణాధికారి పురేందర్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఆలయ మర్యాదలతో వారిని శాలువాతో ఘనంగా సన్మానించి, అమ్మవారి జ్ఞాపికను బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, సిబ్బంది మరియు భక్తులు పాల్గొన్నారు.

# మహిళలను మభ్య పెడుతున్న సిఎం

## ముందు అంగన్‌వాడీలకు జీతాలు చెల్లించండి

## ఎక్స్ వేదికగా హరీష్ రావు విమర్శలు

**హైదరాబాద్, జూన్ 9(నమస్తే ఉదయం):**

అంగన్‌వాడీలకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జీతాలు చెల్లించడం లేదంటూ బీఆర్ఎస్ నేత, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు మండిపడ్డారు. మహిళలను కోటీశ్వరులుగా చేస్తామని రేవంత్ మభ్యపెడుతున్నారని ఆగ్రహించారు. అంగన్‌వాడీలకు ముందు జీతాలు చెల్లించి మహిళలపై ముఖ్యమంత్రికి ఉన్న గౌరవాన్ని నిరూపించుకోవాలన్నారు. రెండు నెలలుగా జీతాలు అందక 62 వేల మంది అంగన్‌వాడీలు కష్టాలు పడుతున్నారని మాజీ మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఎమ్మెల్యే హరీశ్ రావు స్పందించారు. 'రెండు నెలలుగా జీతాలు రాకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న 62 వేల మంది అంగన్‌వాడీ సోదరీమణుల కష్టాలు మీకు కనిపించడం లేదా?. నెలల తరబడి జీతాలు ఇవ్వకుండా వేధిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తప్పకుండా వారి ఉసురు తగులుతుంది. సాటి మహిళల కన్నీటి గోసను మహిళా మంత్రిగా ఉన్న సీతక్క అర్థం చేసుకోకపోవడం శోచనీయం. గత ప్రభుత్వంలో అంగన్‌వాడీల సేవలను గుర్తించిన కేసీఆర్ వారి గౌరవాన్ని పెంచారు. వారు వర్కర్లు కాదని, టీచర్లని పేర్కొంటూ హోదాను ఉన్నతీకరించారు. 2014 నాటికి అంగన్‌వాడీ టీచర్లకు కేవలం రూ.4,200, వారి సహాయకులకు రూ.2,200 వేతనం లభించేది. కానీ, బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక అంగన్‌వాడీ టీచర్ల జీతాన్ని రూ.13,650కు, మినీ అంగన్‌వాడీ టీచర్ల జీతాన్ని రూ.7,800కు, అంగన్‌వాడీ హెల్పర్ల వేతనాన్ని రూ.7,800కు పెంచి దేశంలోనే అత్యధికంగా చెల్లించారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.DAMODHAR REDDY. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733